క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

టెక్కలి: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో టెక్కలిలోని కండ్రవీధి సమీపంలో గల సత్యసాయి మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సేవా సమితి సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉదయం ఎనిమిది గంటల నుంచి శిబిరం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

107 యూనిట్ల రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

టెక్కలి: టెక్కలి పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బర్ల కార్తీక్ జన్మదినం సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కర్తీక్ అభిమానులు 107 యూనిట్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు టి.కిరణ్, నాయకులు వి.శ్రీధర్‌రెడ్డి, కె.అజయ్, ఎ.రాహుల్, బి.రమేష్, కె.జీవన్, మదీన్, రాజేష్, తమ్మయ్య, రాకేష్ పాల్గొన్నారు.

బాలకృష్ణమ్మకు ఘననివాళి



బాలకృష్ణమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కవిటి: ఉపాధ్యాయ ఉద్యమ నేత, దివంగత మాజీ ఎమ్మెల్సీ మార్పు బాలకృష్ణమ్మ 95వ జయంతిని కవిటిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల ఏపీటీఎఫ్ నాయకులంతా ఈ సందర్భంగా కవిటి ప్రాథమిక పాఠశాల ఆవరణలో సమావేశమై బాలకృష్ణమ్మ చిత్రపటానికి పూమాలలువేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన సేవల్ని కొనియాడారు.

యోగాపై అవగాహన



ఆసనాలు వేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: నిత్యం యోగా చేయడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమని యోగా గురువు రితజీ దేవ్ మహారాజ్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు యోగాపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎంఈవో ఎస్.విశ్వనాథం, హెచ్ఎంలు శ్రీనివాసరావు, తమ్మయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవుని మనుగడ



మొక్కలు నాటుతున్న దృశ్యం

ఇచ్ఛాపురం: మొక్కలతోనే మానవుని మనుగడ ముడిపడి ఉందని ఇచ్ఛాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకర్‌రావు అన్నారు. కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రజీ, అధ్యాపక సిబ్బంది శాంతిశ్రీ, సుధాకర్, సునీత పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు!



శంభానవీధిలో చెరువుగా మారిన రోడ్డు



ఎన్టీఆర్ కాలనీ వీధులో ఇలా..

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో చిన్నపాటి చినుకు పడితే చాలు పలు వీధులు చెరువుగా మారుతున్నాయి. వరద నీరు సక్రమంగా ప్రవహించకపోవడంతో వీధులన్నీ చెరువులుగా మారి స్థానికులను అవస్థలకు గురి చేస్తున్నాయి. స్థానిక శంభానవీధి షిర్డీ సాయి మందిరానికి ఎదురుగా, ఎన్టీఆర్ కాలనీ, మండాపోలం కాలనీతో పాటు మరికొన్ని వీధుల్లో ఇదే పరిస్థితి చోటు చేసుకుంటోంది. ఒక వైపు పారిశుద్ధ్య లోపం, మరో వైపు వరద నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇచ్ఛాపురం..

ఇన్‌చార్జిల మయం!

● బదిలీపై వచ్చేందుకు జంకుతున్న అధికారులు

ఇచ్ఛాపురం రూరల్:

జిల్లాలో తొలి మండలంగా.. నియోజకవర్గానికి ప్రధాన కేంద్రంగా ఉన్న ఇచ్ఛాపురం మండలం ఇప్పుడు పరిపాలన పరంగా కుంటిపడింది. అధికారుల లేమితో ఇన్‌చార్జిల పాలన కొనసాగుతుండటంతో అభివృద్ధికి నోచుకోలేని పరిస్థితి. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ప్రతీ శాఖలో పూర్తిస్థాయిలో అధికారులు ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి నాయకుల ఒత్తిడికి తట్టుకోలేక అధికారులు సైతం బదిలీపై వేరే ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. దీంతో రెవెన్యూ శాఖ మినహాయించి ప్రతీ శాఖలో ఇన్‌చార్జిల పాలన సాగుతోంది. మండల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఏడాదిలో ఒక్క రోజు కూడా సర్వసభ్య సమావేశానికి హాజరవ్వలేదు సరికదా...కనీసం మండల పరిషత్‌లో అధికారులతో సమావేశాన్ని నిర్వహించే పరిస్థితి లేకుండా పోయింది. మండలంలో పూర్తి స్థాయిలో ఎంతమంది అధికారులు పనిచేస్తున్నారనే విషయాన్ని ఆయన ఆరా తీయడం లేదని అధికారులే విమర్శిస్తున్నారు.





ఇచ్ఛాపురం ఎంపీడీవో కార్యాలయం

ఇన్‌చార్జిలు ఇలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎంపీడీవో, ఈవోపీఆర్డీ బదిలీపై వెళ్లి పోవడంతో వారి స్థానంలో ఏవో రామారావు, బూర్జపాడు పంచాయతీ కార్యదర్శి కృష్ణలు ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈవోపీఆర్డీలుగా వ్యవహరిస్తున్నారు. అలాగే 21 పంచాయతీల్లో 21 మంది పంచాయతీ కార్యదర్శులుగా ఉండాల్సింది పోయి కేవలం పది మంది మాత్రమే విధులు నిర్వహిస్తూ చేరో పంచాయతీలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. అలాగే మండలంలో సుమారు పదివేలకుపైగా పశు సంపద ఉంది. గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన ఈదుపురం, కొళిగాం పశు వైద్యాధికారులు లవ్‌కుమార్, జి.కిరణ్‌కుమార్‌లు కూటమి ప్రభుత్వంలో బదిలీపై వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు. దీంతో మండలానికి పశువైద్యుడే లేకుండా పోయాడు. అలాగే మండలంలో సుమారు తొమ్మిది వేల ఎకరాల్లో రైతులు వ్యవసాయం చేస్తుండగా, ఇక్కడ పని చేసే వ్యవసాయాధికారిని డాక్టర్ భార్గవి ఇటీవల బదిలీపై వెళ్లిపోవడంతో ప్రస్తుతం ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఇచ్ఛాపురం ఐసీడీఎస్ పీవో పి.నాగరాణి ఇటీవల బదిలీపై శ్రీకాకుళం వెళ్లిపోగా, ఆ స్థానంలో పీవోగా చేరేందుకు అధికారులు ముందుకు రావడం లేని పరిస్థితి. దీంతో తక్కువగా ఉన్న సూపర్‌వైజర్లపై భారం పడుతుండటంతో వారంతా సతమతమవుతున్నారు. అదే విధంగా వెలుగు ఏపీఎం పోస్టు ఖాళీగా ఉండగా, ఉపాధి హామీ పథకం ఏపీవో ఇన్‌చార్జిగా పి.శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నారు. దీంతో పాటు పంచాయతీరాజ్ శాఖ అధికారి సూర్యప్రకాశరావు ఇన్‌చార్జిగా టెక్కలి వెళ్లిపోగా, పీఆర్ మండల ఇంజినీరింగ్ అధికారి భగీరథ దొళాయి ఉద్యోగ విరమణ తరువాత సోంపేటకు చెందిన రమేష్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. హౌసింగ్ శాఖకు సంబంధించి శ్రీకాకుళానికి చెందిన డీఈ వి.సత్యాజీ ఇచ్ఛాపురంలో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. హౌసింగ్ ఏఈగా కేశుపురం గ్రామ సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ విశ్వనాథం రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఇలా మండలంలోని ప్రతీ ప్రభుత్వ కార్యాలయం ఇన్‌చార్జిల మయంగా మారింది. స్థానిక కూటమి నాయకులు ఒత్తిళ్లకు తట్టుకోలేక అధికారులు ఇచ్ఛాపురం వచ్చేందుకు జంకుతున్నారని, మరో వారం రోజుల్లో ఇంచుమించు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది బదిలీపై వెళ్లి పోయే అవకాశం ఉందని సమాచారం.

ఎమ్మెల్యే శ్రద్ధ చూపిస్తే చాలు..

స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఇచ్ఛాపురం మండలంపై శీతకన్ను వేశారని, ఆయన కాస్తా మండలాభివృద్ధి, పాలనపై దృష్టి సారిస్తే బాగుంటుందని మేధావులు అంటున్నారు. కవిటి, కంచిలి, సోంపేట మండలాల్లో అన్ని శాఖాల్లో పూర్తి స్థాయిలో అధికారులు ఉన్నప్పటికీ కేవలం ఇచ్ఛాపురం మండలంలోనే ఇన్‌చార్జిల పాలనకు కూటమి ప్రభుత్వం ఎందుకు ప్రోత్సాహిస్తుందో అంతుబట్టడం లేదని బహిరంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో మండలంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే పూర్తి స్థాయిలో అధికారులు ఉండేందుకు అవకాశం ఉంటుందని ప్రజలు అంటున్నారు.

> **ఎన్నాళ్లీ ఇన్‌చార్జిల పాలన**
>
> 
>
> గత ప్రభుత్వ హయాంలో ఇంచుమించు అన్ని శాఖల్లో పూర్తి స్థాయిలో అధికారులు ఉండేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చాలా మంది అధికారులు బదిలీపై వెళ్లిపోయారు. చివరకు గ్రామ సచివాలయాల్లో ఒకరిద్దరు మాత్రమే ఉన్నారు. ఏడాది నుంచి రెగ్యులర్ ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, పూర్తి స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు లేకుండా పోయారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుంటే పూర్తి స్థాయిలో అధికారులు వచ్చే అవకాశం ఉంది.
>
> – బోర పుష్ప, ఎంపీపీ, ఇచ్ఛాపురం మండలం

ఎట్టకేలకు విత్తనాలు పంపిణీ

పలాస: పలాస మండలంలో రైతులకు ఎట్టకేలకు రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాలు పంపిణీ చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. 'విత్తనాల కోసం రైతులు ఎదురు చూపులు' శీర్షికతో ఇటీవల 'సాక్షి'లో కథనం వెలువడిన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన అధికారులు శుక్రవారం నుంచి వరి విత్తనాలు పంపిణీకి చర్యలు తీసుకున్నారు. బొడ్డపాడు రైతు సేవా కేంద్రం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు వరి విత్తనాలను రైతులకు అందజేశారు. ఏఈవో తెప్పల పావని, సర్పంచ్ తామాడ మదన్, రైతు సంఘం నాయకులు కిక్కర డిల్లీరావు, దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచనరావు, చాకలి గుణవంతు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఇతర గ్రామాల్లో కూడా వరివిత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పోలారావు మాట్లాడుతూ.. 1088 క్వింటాళ్ల వరి విత్తనాలు వచ్చాయని.. రైతులకు సబ్సిడీపై పంపిణీ చేస్తున్నామన్నారు.

సాక్షి ఎఫెక్ట్...



బొడ్డపాడులో విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రోడ్లపైకి మురుగునీరు..!

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 17, 18వ వార్డుల పరిధిలోని కాలువల్లో పూడిక పేరుకుపోయింది. దీంతో మురుగునీరు సీసీరోడ్లపైకి వచ్చేస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముక్కుపుటలు పగిలేలా వస్తున్న వాసనతో స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

విద్యార్థులకు అభినందన



మందస: కీర్తినను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



కాశీబుగ్గ: మనోహర్‌కు మెమెంటో అందజేస్తున్న ఉపాధ్యాయులు



ఇచ్ఛాపురం టౌన్: జోత్స్నకు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

మందస: కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో చదివి పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 590 మార్కులు సాధించిన పైల కీర్తిన షైనింగ్ స్టార్ అవార్డును అందుకుంది. దీంతో ఆమెను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూన వేణుగోపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు. ఉపాధ్యాయులు గణేశ్వరరావు, జి.భీమారావు, ఎం.లక్ష్మణరావు, దమోదరం, గోపాలకృష్ణ, బి.రమేష్ పాల్గొన్నారు.

కాశీబుగ్గ: ఇటీవల విడుదలైన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు 158 మార్కులు సాధించిన కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రోల్ల మనోహర్ ఎంపికాయ్యడు. దీంతో ప్రధానోపాధ్యాయులు చిన్ననాయుడు చేతులమీదుగా విద్యార్థిని సత్కరించి మెమెంటో అందించి సత్కరించారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ కిల్లి వెంకటరావు, ఉపాధ్యాయులు వేణుగోపాల్, నగేష్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం టౌన్: స్థానిక కేజీబీవీలో చదివిన తూటిపురం గ్రామానికి చెందిన లింగం జోత్స్న పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమంగా నిలిచింది. దీంతో ఆమెను పాఠశాలలో శుక్రవారం అభినందించారు. అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ ఫార్మాసిస్ట్ రఘుబాబు విద్యార్థినికి రూ. రెండువేలు అందజేశారు. జోత్స్న ఉన్నత చదువులకు తనవంతుగా సహాయం అందజేస్తానన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి.శిరీష, అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ వైద్యులు అఖిల్ మనోహర్, తొమ్మిదో వార్డు కౌన్సిలర్ బి జగన్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

సోంపేట: సోంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సోంపేట, కంచిలి మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగాల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవో కె.వసుంధరదేవి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ. ఒక కార్యకర్త, మూడు సహాయకులు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. సోంపేట మండలంలోని పలాసపురం అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకులు, కంచిలి మండలం బొగాబెణి పంచాయతీ జెన్నగయిలో కార్యకర్త, జె.బైరిపురం, బూరగాం-2 కేంద్రాల్లో సహాయకుల పోస్టులను భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తులను సోంపేట ప్రాజెక్టు కార్యాలయానికి అందజేయాలన్నారు.

నందిగాం: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏసీడీపీఓ ఉమామహేశ్వరి తెలిపారు. పోతులూరు (బీసీ-డీ), తమలాపురం (ఓసీ), తురకులకోట(ఓసీ) కేంద్రాల్లో నియామకం కోసం 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

17న ఉచిత నేత్ర వైద్య శిబిరం

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధి పలాస సత్యసాయి మందిరం వద్ద ఈ నెల 17వ తేదీన ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత మెగా నేత్ర వైద్య నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సవా సమితి సభ్యులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ, హెల్త్‌కార్డుల ఆధారంగా శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

మందస: మందసలోని భూలోకమ్మ తల్లి అమ్మవారి దేవాలయానికి ప్రహరీ, సింహం బొమ్మల ఏర్పాటు పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. దాసరి కామేశ్వరి సహకారంతో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఏపీఎంగా ప్రసాదరావు



ప్రసాదరావు

సోంపేట: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సోంపేట ఏపీఎంగా ఎస్.ప్రసాదరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న రమణమ్మ బదిలీపై వెళ్లగా.. ఇచ్ఛాపురంలో విధులు నిర్వహిస్తున్న ప్రసాదారవు ఇక్కడకు వచ్చారు.

టీటీడీ కల్యాణ మండపం నిర్మించాలని వినతి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో టీటీడీ కల్యాణ మండపం నిర్మించాలని రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ వేగులాడ దుర్గారావు కోరారు. ఈ మేరకు రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని శుక్రవారం అమరావతిలో కలిసి వినతి పత్రం అందించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్టు దుర్గారావు తెలిపారు.

'అపరిచిత వ్యక్తుల సమాచారమివ్వండి'



మాట్లాడుతున్న మెరైన్ ఎస్సై శ్రీనివాసరావు

వజ్రపుకొత్తూరు: సముద్రంలో వేటకు వెళ్లేటప్పుడు అపరిచిత వ్యక్తులు తారసపడితే సమాచారం ఇవ్వాలని భావనపాడు మెరైన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై శ్రీనివాసరావు కోరారు. కొత్తపేట గ్రామంలో సిబ్బందితో కలిసి గురువారం రాత్రి పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు, మత్స్యకారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వేట సమయంలో అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల సమాచారం అందించాలని, ఒంటరిగా వేటకు వెళ్లరాదని సూచించారు. సమావేశంలో గుంటు గోవిందరావు, గుంటు నారాయణరావు, గీత రవికుమార్, ఇరపల్లి రామారావు, దుక్క ఆదినారాయణ, ఆకెర్ల పాపారావు పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియ సంఘ భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కవిటి: మండల కేంద్రం కవిటిలో అగ్నికుల క్షత్రియ సంఘం అదనపు భవనాన్ని ప్రజాప్రతినిధులు శుక్రవారం ప్రారంభించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా, ఎంపీపీ కడియాల పద్మ భవనాన్ని ప్రారంభించారు. జెడ్పీ నుంచి రూ. 15 లక్షలు, మండల పరిషత్ నుంచి రూ. 6 లక్షల నిధులు సమీకరించి భవన నిర్మాణం చేపట్టినట్టు అగ్నికుల క్షత్రియ సంఘం నాయుడు పొల్లాయి లక్ష్మణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కడియాల ప్రకాష్, పి.లక్ష్మణరావు, పి.నీలాచలం, బి.వెంకటేశ్వరరావు, వై.సీలయ్య, పి.శ్రీరాములు పాల్గొన్నారు.

పది మద్యం షాపులకు 20 మంది దరఖాస్తు



వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని ఆస్పత్రి రోడ్, మెయిన్ రోడ్‌లో ఉన్న పది షాపులకు సంబంధించి 20 మంది దరఖాస్తు చేసుకున్నారని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వేలం నిర్వహించగా 35 పోటీపడ్డారు.

వీరిలో 20 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఎక్కువగా పాట పాడుకొన్న వారికి షాపులను కేటాయించినట్లు కమిషనర్ స్పష్టం చేసుకున్నారు. వీటి ఆమోదం కోసం కౌన్సిల్‌కి తీసుకొస్తున్నామని, తుది నిర్ణయం కౌన్సిల్ తీర్మానం తరువాత ప్రకటిస్తామన్నారు. మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.మోహన్‌రావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమలు తెరవకుంటే ధర్నా చేస్తాం

● జీడి కార్మిక సంఘ అధ్యక్షుడు క్రిష్ణమూర్తి



మాట్లాడుతున్న క్రిష్ణమూర్తి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో రెండు వారాలుగా మూసివేసిన జీడి పరిశ్రమలను తక్షణమే తెరవాలని.. లేకుంటే పీసీఎంఏ ఎదుట ధర్నా చేస్తామని కాష్యూ లేబర్, రైస్ మిల్లర్స్ లేబర్ యూనియన్ అధ్యక్షులు అంబటి క్రిష్ణమూర్తి హెచ్చరించారు. స్థానిక సంఘ భవనంలో కార్యవర్గసభ్యులతో అత్యవసర సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ కారణాలతో పరిశ్రమలను మూసి వేసివేయడంతో కార్మికులకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పరిశ్రమలను తెరవాలని సోమవారం వరకు గడువు ఇస్తున్నామని.. అనంతరం పీసీఎంఏ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని వెల్లడిచారు. సమావేశంలో సంఘ కార్యదర్శి సానా ఈశ్వరరావు, కోశాధికారి కోనారి రాము, బొంపల్లి సింహాచలం, కోనారి భీమారావు, జోగి మోహనరావు పాల్గొన్నారు.

జర్సీలు వితరణ



మందస మండలం పొత్తంగి సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయ బృందం ఆర్థిక సహకారంతో 20 కొత్త జెర్సీలను సమాకూర్చారు. వీటిని క్రీడాకారులకు శుక్రవారం అందజేశారు. ప్రధానోపాధ్యాయులు నగిరి తారకేశ్వరరావు మాట్లాడుతూ.. క్రీడాకారులు బాగా రాణించి ఉత్తములుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు జగన్నాథం, సింహంచలోపతి, దువ్వ వైకుంఠరావు, ఢిల్లీ, నారాయణ, శశి, హరితరాణి, వేణుగోపాల్, కామేశ్వరరావు పాల్గొన్నారు. –మందస

నాయకుల పరామర్శ



కంచిలి మండలం బూరగాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొట్టా చిన్నారావు తల్లి యశోదమ్మ, ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు సుగ్గు ఛత్రపతిరెడ్డి సోదరుడు సుగ్గు హరిపతిరెడ్డి ఇటీవల మృతిచెందారు. ఈ రెండు కుటుంబాలను కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి మండల పార్టీ నేతలతో కలిసి శుక్రవారం పరామర్శించారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, దుర్గాసి ధర్మారావు, లడ్డు కేశవపాత్రో, కొణపల సురేష్, తలగాన తిరుపతిరావు, మడ్డు వెంకటరావు, లొద్దపుట్టి ఎంపీటీసీ సభ్యుడు పిట్ట ఆనంద్‌రెడ్డి, బూరగాం మాజీ సర్పంచ్ మడ్డు వెంకటేశ్వరరావు, మద్దిల భీమారావు, మడ్డు అభియాదవ్, పిల్లల లింగరాజు ఉన్నారు. –కంచిలి

యూనిఫాం పంపిణీ



సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప అన్నారు. కె.శాసనాం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కారంగి త్రినాథరావు, హెచ్ఎం కె.సత్యమయ్యలు పాల్గొన్నారు. – ఇచ్ఛాపురం రూరల్